

తెలంగాణభవన్‌లో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, పక్కన మాజీ మంత్రి మహమూద్ అలీ, రావుల తదితరులు

తెలంగాణభవన్‌లో గణతంత్ర వేడుకలు

- **జాతీయ జెండాను ఎగురవేసిన మధుసూదనాచారి**

హైదరాబాద్, జనవరి 26 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ పార్టీ కేంద్ర కార్యాలయం తెలంగాణభవన్‌లో గణతంత్ర వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పార్టీ సీనియర్ నేత, శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి జాతీయ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి మహమూద్ అలీ, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, పార్టీ నేతలు తుల ఉమ, సుమిత్రా ఆనంద్, సుశీలారెడ్డి, దాసోజు శ్రవణ్, దేవీప్రసాద్, గెల్లు శ్రీనివాస్‌యాదవ్, తుంగ బాలు, కిశోర్‌గౌడ్, బొమ్మెర రామ్మూర్తి, ఫయాజ్, మన్నె గోవర్ధన్‌రెడ్డి, భవన్ ఇన్‌చార్జి నాయినేని రాజేశ్‌రావు, పర్యాద కృష్ణమూర్తి, గాంధీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లోని 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ సీనియర్ నేత దాసోజు, గెల్లు శ్రీనివాస్, కురువ విజయ్‌కుమార్ తదితరులు

అంబేద్కర్‌కు అవమానం దుర్మార్గం

- **మహనీయుడి విగ్రహాన్ని నిర్బంధించడం బాధాకరం**
- **బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్‌కుమార్**
- **125 అడుగుల విగ్రహం వద్ద నిరసన**

హైదరాబాద్, జనవరి 26 (నమస్తేతెలంగాణ): సచివాలయం పక్కన గల అంబేద్కర్ విగ్రహ ప్రాంగణానికి తాళాలు వేసి అవమానించడం దుర్మార్గమని బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ ఖండించారు. దేశానికి రాజ్యాంగాన్ని ప్రసాదించిన ఆ మహనీయుడిని నిర్బంధించడమంటే యావత్ తెలంగాణను నిర్బంధించినట్టేనని ఆవేదన వ్యక్తంచేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం వద్ద బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రవణ్ మాట్లాడుతూ.. సూర్య చంద్రులు ఉన్నంత వరకు అంబేద్కర్ స్ఫూర్తిని ఎవరూ నిరోధించలేరని పేర్కొన్నారు. ఓ వైపు కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ రాజ్యాంగం పట్టుకొని తిరుగుతుండగా, మరోవైపు సీఎం రేవంత్ రెడ్డి.. భారీ అంబేద్కర్ విగ్రహాన్ని చూడకుండా, నివాళులర్పించకుండా తాళాలు వేయడం తగదని మండిపడ్డారు. కేవలం కేసీఆర్ ఏర్పాటుచేశారనే అక్కసుతోనే విగ్రహాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజల మనోభావాలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ రాజ్యాంగ విలువలను కాలరాస్తున్న రేవంత్‌రెడ్డికి ప్రజలు తగిన సమయంలో బుద్ధి చెప్తారని హెచ్చరించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద బీఆర్ఎస్ నాయకులు పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు కురువ విజయ్‌కుమార్, కిశోర్‌గౌడ్, తుంగ బాలు, రఘురాం, ఆశిష్‌కుమార్ యాదవ్, సుమిత్రా మహాజన్, సుశీలారెడ్డి పాల్గొన్నారు.

తడిబట్టలతో రా.. నేనూ వస్తా

మొదటిపేజీ తరువాయి...

ఎకరాలకు సాగునీళ్లు అందించామని, కేసీఆర్ హయాంలో జిల్లాకు కృష్ణా జలాలను పారించామని చెప్పారు. మహబూబ్‌నగర్ జిల్లాను ఎండబెట్టింది, అన్యాయం చేసింది కాంగ్రెస్, టీడీపీలేనని విమర్శించారు. సీఎంగా నోరు పెద్దగా చేసుకొని అబద్ధాలు మాట్లాడితే నిజం అవుతుందా? అని నిలదీశారు.

దరఖాస్తు లేకుండా రైతుబంధు ఇచ్చినం

రాష్ట్రవ్యాప్తంగా ఎలాంటి దరఖాస్తు తీసుకొకుండా 11 విడతల్లో 69.5 లక్షల మంది రైతులకు రూ.73 వేల కోట్ల రైతుబంధు ఇచ్చామని హరీశ్‌రావు గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పెద్దలకు తొలగించి అసలైన వారికే ఇస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి చేస్తున్నదేమిటని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయంలో 69.5 లక్షల మంది రైతులకు రైతుబంధు ఇస్తే, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వానికి 70 లక్షల మంది ఎలా వచ్చారని నిలదీశారు. పేద ప్రజల ఉసురు తీస్తూ దరఖాస్తులు చేయించుకుంటున్నరని, బీఆర్ఎస్ హయాంలో 57 ఏండ్లకే పింఛన్లు ఇచ్చి చూపించామని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి నిద్రలో కూడా కేసీఆర్‌నే తలుచుకుంటున్నారని, కేసీఆర్‌లా పనిచేయడం ఆయనకు చేతకాదని దుయ్యబట్టారు. రేవంత్‌కు చేతకాకపోవడానికి పరాకాష్ట, అసమర్థతకు నిదర్శనం ఏడాదిలో ఒక్క పథకాన్ని కూడా అమలుచేయలేకపోవడమేనని మండిపడ్డారు. వ్యవసాయ కూలీలకు ఆత్మీయ భరోసా పథకం విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి మాటలు నమ్మాలో, మంత్రి సీతక్క మాటలు నమ్మాలో తెలియని పరిస్థితి నెలకొన్నదని ఎద్దేవా చేశారు. షరతులు, కోతలతో ప్రజా ప్రభుత్వం కూలీలను కూడా మోసం చేస్తున్నదని దుయ్యబట్టారు.

> కేసీఆర్ పదేండ్ల కాలంలో ఒక్క దరఖాస్తు తీసుకోకుండా అర్హులకు సంక్షేమ పథకాలు అమలుచేశారు. ఇప్పుడు దరఖాస్తులే దరఖాస్తులు తప్ప ఒక్క పథకం అమలుకావడం లేదు. కేసీఆర్ 6.47 లక్షల మందికి రేషన్‌కార్డులు ఇచ్చి ఎలాంటి షరతులు లేకుండా ఒక్కొక్కరికి ఆరు కిలోల బియ్యం పంపిణీ చేశారు.
> - హరీశ్‌రావు

గజ్వేల్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, చిత్రంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్, రోజా రాధాకృష్ణ శర్మ తదితరులు

డమ్మీ చెక్కులిచ్చిన సీఎం

మహబూబ్‌నగర్ జిల్లా రైతులకు నవంబర్ 30న రూ.2,700 కోట్ల రుణమాఫీ డమ్మీ చెక్కును సీఎం రేవంత్ ఇచ్చారని, సీఎం ఇచ్చిన చెక్కు పాస్ కాకపోతే ఆయనకు ఆ కుర్చీలో కూర్చునే అర్హత లేదని, వెంటనే డమ్మీ చెక్కును పాస్ చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ప్రభుత్వం రూ.31 వేల కోట్ల రుణమాఫీ చేయాల్సి ఉండగా రూ.21వేల కోట్లు మాత్రమే మాఫీ చేసి చేతులు దులుపుకున్నదని విమర్శించారు. మంత్రి దామోదర రాజనర్సింహ ఉమ్మడి మెదక్ జిల్లాలోని ఒక గ్రామంలో 183 మందికే రుణమాఫీ అయిందని చెప్తుంటే, అందరికి అయిందని సీఎం చెప్తున్నారని దుయ్యబట్టారు. అబద్ధపు పునాదులపై అధికారంలోకి వచ్చి సీఎం కుర్చీ పరువు తీస్తున్నారని మండిపడ్డారు. అధికారంలోకి వస్తే ఎకరాకు రూ.15 వేల రైతుభరోసా ఇస్తామని చెప్పి, నేడు రూ.6 వేలు ఖాతాలో వేస్తున్నరని, ప్రతి రైతుకు ఎకరాకు రూ.9 వేలు బాకీ పడిందని వివరించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలను, నాయకులను రైతుబంధుపై నిలదీయాలని రైతులకు పిలుపునిచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టులో ఒక పిల్లర్ కూలితే ప్రాజెక్టు కూలినట్టు అబద్ధాలు చెప్పారని విమర్శించారు. కేసీఆర్ నిర్మించిన కాళేశ్వరం నుంచే మల్లన్నసాగర్, రంగనాయకసాగర్, కొండపోచమ్మకు నీళ్లు వచ్చాయని, వాటి నుంచే 20 టీఎంసీలు హైదరాబాద్‌కు, 5 టీఎంసీలు మూసీకి తీసుకుపోతామంటున్నారని చెప్పారు.

> ఆగస్టు 15న రుణమాఫీ చేస్తామంటూ ముక్కోటి దేవతలపై ఒట్టు పెట్టి అబద్ధాలు ఆడారు. నాలుగు సంక్షేమ పథకాలను అమలుచేస్తామని చెప్పి, అత్యంత పవిత్రమైన రాజ్యాంగం అమల్లోకి వచ్చిన రోజును అవమానపరిచారు.
> - హరీశ్‌రావు

వందరోజులు ఎటుపోయాయి?

వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు, 13 హామీలు అమలుచేస్తామని చెప్పి 400 రోజులైనా మహాలక్ష్మి, పేదలకు ఇండ్లు, పింఛన్లు, విద్యార్థులకు భరోసా ఇవ్వలేదని హరీశ్‌రావు విమర్శించారు. రేవంత్‌రెడ్డి మాటల మీద నమ్మకం లేక 400 రోజుల్లో 400 మంది రైతు ఆత్మహత్యలకు పాల్పడ్డారని, రైతులు ఉసురు తగులుతుందని చెప్పారు. కార్యక్రమంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ సుధాకర్‌రెడ్డి, కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్, భూపతిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, మాదాసు శ్రీనివాస్ పాల్గొన్నారు.

అధికారులకు కలెక్టర్ మెమోలు

- **కేంద్రమంత్రి పర్యటన సందర్భంగా విధుల్లో నిర్లక్ష్యం వహించినవారిపై చర్యలు**

కరీంనగర్, జనవరి 26 (నమస్తే తెలంగాణ) : కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ పర్యటన సందర్భంగా విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులకు శనివారం రాత్రి కలెక్టర్ పమేలా సత్పతి మెమోలు జారీ చేశారు. ఈ నెల 24న కరీంనగర్‌లో పలు అభివృద్ధి పనుల్లో పాల్గొనేందుకు కేంద్ర మంత్రి ఖట్టర్, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్, రాష్ట్ర మంత్రులు పొన్నం, పొంగులేటి పర్యటించారు. ఈ సందర్భంగా పలు చోట్ల తోపులాట జరగడంతో మంత్రి పొంగులేటి కలెక్టర్‌పై ఆగ్రహం వ్యక్తంచేశారు. మరో మంత్రి పొన్నం ప్రభాకర్ కల్పించుకుని కనీసం ఏసీపీ కూడా ఇక్కడ లేరని వ్యాఖ్యానించారు. కలెక్టర్‌ను ఉద్దేశించి 'కామన్ సెన్స్ ఉండదా'' అంటూ పొంగులేటి వ్యాఖ్యానించారు. దీనిని సీరియస్‌గా తీసుకున్న కలెక్టర్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీసు(టౌన్), ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, జిల్లా యూత్ అండ్ స్పోర్ట్స్ అధికారి, జిల్లా సంక్షేమ అధికారి, జిల్లా విద్యాధికారి, డీఆర్‌డీవోలకు మెమోలు జారీ చేసి సంజాయిషీ కోరారు.

అధికార వర్గాల్లో కలకలం

కలెక్టర్ జారీ చేసిన నోటీసులు అధికార వర్గాల్లో కలకలం రేపుతున్నాయి. మంత్రులు సీరియస్ అయిన నేపథ్యంలో ప్రభుత్వం వివరణ కోరినట్టు స్పష్టమవుతున్నది. కరీంనగర్ టౌన్ ఏసీపీ వెంకటస్వామికి ఇచ్చిన మెమోలో భద్రత విషయంలో వైఫల్యాలను పొందుపర్చారు. హెలీప్యాడ్ వద్ద, ట్రాఫిక్ కంట్రోల్ విషయంలో ఉదాసీనంగా వ్యవహరించడంపై వివరణ ఇవ్వాలని పేర్కొన్నారు. ఆర్డీవోకు ఇచ్చిన మెమోలో పర్యటన సందర్భంగా ప్రారంభోత్సవాలు, బహిరంగ సభ వద్ద అధికారులకు కేటాయించిన విధుల వద్ద వారు ఉన్నారా? లేరా? అనే విషయమై వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

రాష్ట్రంలో భిన్న వాతావరణం

- **ఉదయం పలుచోట్ల తీవ్ర మంచు ప్రభావం**
- **మధ్యాహ్నం 30 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు**

హైదరాబాద్, జనవరి 26 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర వ్యాప్తంగా భిన్న వాతావరణ పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఆగ్నేయ దిశ నుంచి వీచే గాలుల ప్రభావంతో ఉదయం పలుచోట్ల తీవ్ర మంచు కమ్మేస్తుండగా.. పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే అధికంగా నమోదవుతున్నాయి. సగటున రాత్రి ఉష్ణోగ్రతలు 15 డిగ్రీలు, పగటి ఉష్ణోగ్రతలు 30 డిగ్రీలకు పైగా నమోదవుతున్నట్టు హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. మరో మూడురోజులు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉన్నదని పేర్కొంది. రాష్ట్రవ్యాప్తంగా శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం 8 గంటల వరకు సంగారెడ్డి జిల్లా కోహిర్‌లో 9.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైనట్టు వెల్లడించింది. సూర్యాపేట మినహా అన్ని జిల్లాల్లో 15 డిగ్రీల్లోపు ఉష్ణోగ్రతలు నమోదైనట్టు ప్రకటించింది.

రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ యత్నం: ప్రకాశ్‌కారత్

కొండాపూర్, జనవరి 26 : రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ యత్నిస్తున్నదని సీపీఐఎం జాతీయ నాయకుడు ప్రకాశ్ కారత్ ఆరోపించారు. ఆదివారం సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మత్కాపూర్‌లో కొనసాగుతున్న సీపీఎం రాష్ట్ర మహాసభలకు ఆయన హాజరై మాట్లాడారు. జాతీయ నాయకుడు సీతారాం ఏచూరి లేని లోటును తీర్చాల్సిన బాధ్యత పార్టీ నాయకులపై ఉందని చెప్పారు. రష్యా– ఉక్రెయిన్, ఇజ్రాయిల్– పాలస్తీనా దేశాల మధ్య యుద్ధాలు జరుగుతుండగా.. భారత ప్రభుత్వం ఇజ్రాయిల్‌కు మద్దతు ఇస్తున్నదని, పాలస్తీనాను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రధాని నరేంద్రమోదీ అమెరికాకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని విమర్శించారు. దేశ సంపదలో 20శాతం అదానీ, అంబానీ, టాటా, బిర్లాల చేతుల్లో ఉండిపోయిందని చెప్పారు. రైతుల పోరాటాలతో వెనక్కి తగ్గిన కేంద్ర ప్రభుత్వం, ఇప్పుడు మళ్లీ నల్లచట్టాలను తేవాలని చూస్తున్నదని తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీర భద్రం, కార్యదర్శి వర్గ సభ్యులు చుక్కా రాములు తదితరులు పాల్లొన్నారు.

మా గవర్నమెంట్‌లో కరప్షన్

- **రెవెన్యూశాఖలో అవినీతి ఎక్కువే ఎంత పెద్దవారినైనా రోడ్డుమీదికి ఈడుస్తా**
- **జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి**

మహబూబ్‌నగర్, జనవరి 26 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వంలో కరప్షన్ పెరిగిపోతున్నదని, బీఆర్ఎస్ నుంచి వచ్చిన వాళ్లదే హవా నడుస్తున్నదని.. భూ మాఫియా పేట్రేగిపోతున్నదంటూ మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేసినట్టు రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తున్నది. ఎంతటి పెద్దవాడైనా రోడ్డు మీదికిడుస్తానంటూ హెచ్చరించారు. ఆదివారం జడ్చర్లలో ఓ మీడియా సంస్థతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఒకవైపు ఉమ్మడి జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి నాలుగు పథకాలు ప్రారంభిస్తున్న సందర్భంలో జడ్చర్ల ఎమ్మెల్యే ఈ వ్యాఖ్యలు చేయడం తీవ్ర దుమారాన్ని లేపింది. కాంగ్రెస్ పార్టీలో అసలు ఏం జరుగుతున్నదని.. మంత్రులకు ఎమ్మెల్యేలకు సఖ్యత ఉందా..లేదా..? ప్రభుత్వంపైనే విమర్శలు చేస్తున్నారా..? అని అనుమానాలు కలుగుతున్నాయి. 'ప్రజా పాలన బాగుంది..ప్రజలకు కావాల్సిందే ఈ రోజు జరుగుతున్నది.. అయినా ఆ గవర్నమెంట్‌కు ఈ గవర్నమెంట్‌కు కొంచమే తేడా ఉంది. రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో ఇంకా కొంచెం అవినీతి ఉన్నది. కొంతమంది రెవెన్యూలో సమస్యలు ఉంటే మళ్లీ ప్రొహిబిట్‌లో పెట్టి వసూలు చేసుకుంటున్నారు. ఆ రెవెన్యూ డిపార్ట్‌మెంట్ ఎవరైనా గాని.. ఎంత పెద్ద వారైనా గాని.. కొంతమంది బీఆర్ఎస్ నుంచి వచ్చిన వాళ్లు ఈ కార్యక్రమాలు చేస్తున్నారు. బీఆర్ఎస్ వాళ్లకే మాట్లాడుకొని ల్యాండ్ ప్రొహిబిటెడ్‌లో ఉంటే ముప్పై, నలభై పర్సెంట్ రాయించుకొని చేస్తున్నారు. కొంత మంది నా దగ్గరకు వచ్చారు. కచ్చితంగా ఎంత పెద్ద నాయకుడైనా వాన్ని రోడ్డు మీదకు లాగుతా' అని అనిరుధ్‌రెడ్డి హెచ్చరించారు.

గురుకుల విద్యార్థిని ఆత్మహత్య

హయత్‌నగర్, జనవరి 26: గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ కళాశాలలో ఉరేసుకుని ఓ ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన హయత్‌నగర్‌లో ఆదివారం జరిగింది. నాగర్ కర్నూల్ జిల్లా కొండనాగుల మండలం అంబగిరికి చెందిన ఉడతనూరి సౌమ్య(17) స్థానిక రెసిడెన్షియల్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నది. ఆదివారం తరగతి గదిలోని ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. వెంటనే వనస్థలిపురం ఏరియా దవాఖానకు తరలించగా.. మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ బ్యాంకింగ్ వ్యవస్థ విధ్వంసానికి కుట్ర

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

హైదరాబాద్, జనవరి 26 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వరంగ బ్యాంకింగ్ వ్యవస్థను విధ్వంసం చేసే కుట్రను బ్యాంక్ ఉద్యోగులు సమర్థంగా ఎదుర్కోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వర్‌రావు సభా ప్రాంగణంలో జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ తెలంగాణ బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ 30వ త్రైవార్షిక మహాసభల్లో భాగంగా రెండో రోజు ఆదివారం కూనంనేని సాంబశివరావు హాజరై మాట్లాడారు.

రాష్ట్రాల హక్కులను హరించేలా బండి వ్యాఖ్యలు

- **కేంద్రం నుంచి ఒక్క ఇల్లు ఇవ్వబోమని అహంకారపు మాటలు**
- **కేంద్రమంత్రి హోదాలో మాట్లాడే తీరు అదేనా?**
- **తెలంగాణలో కొరవడిన రాజ్యాంగ స్ఫూర్తి**
- **ఆసిఫాబాద్ అల్లర్లలో వందలాది మంది నిరాశ్రయులు**
- **పట్టించుకోని సీఎం, మంత్రులు**
- **రాజ్యాంగంపై సెమినార్‌లో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత**

తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో రాజ్యాంగంపై నిర్వహించిన సెమినార్‌లో అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్ సిటీ బ్యూరో, జనవరి 26 (నమస్తే తెలంగాణ): బాధ్యతాయుతమైన కేంద్రమంత్రి పదవిలో ఉండి రాష్ట్రానికి ఒక్క ఇల్లు కూడా ఇవ్వబోమని చెబుతూ రాజ్యాంగంలోని ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా బండి సంజయ్ వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. తెలంగాణ జాగృతి విద్యార్థి ఫెడరేషన్(టీజేఎస్ఎఫ్) ఆధ్వర్యంలో అబిడ్స్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో ఆదివారం 'గణతంత్ర భారత్–జాగృత భారత్' పేరిట భారత రాజ్యాంగంపై సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కవిత ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. బండి సంజయ్ వ్యాఖ్యలు రాష్ట్రాల హక్కులను హరించేలా ఉన్నాయని మండిపడ్డారు. కింది స్థాయిలో పథకాలు అమలు చేయాల్సింది రాష్ట్ర ప్రభుత్వాలనే విషయం ఆయనకు తెలియదా? అని ప్రశ్నించారు. కేంద్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా రాష్ట్రాల హక్కులను హరించే అధికారం వారికి లేదని స్పష్టం చేశారు. బండి సంజయ్ మాటలను విద్యార్థి నేతలు, మేధావులు ఎండగట్టాలని పిలుపునిచ్చారు.

రాహుల్ జీ.. ఇదేనా మీ రాజ్యాంగ స్ఫూర్తి?

రాజ్యాంగాన్ని కాపాడాలని రాహుల్‌గాంధీ పాకెట్ డైరీలా దాన్ని పట్టుకుని దేశమంతా తిరుగుతుంటే రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాత్రం రాజ్యాంగస్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని కవిత ధ్వజమెత్తారు. రాజ్యాంగ విలువలను ముందు తెలంగాణలో కాపాడాలని రాహుల్‌కు సూచించారు. కొద్దిరోజుల కిందట ఆసిఫాబాద్ జిల్లాలో పెద్దఎత్తున మతకలహాలు జరిగి వందలాది మంది ప్రజలు నిరాశ్రయులయ్యారని తెలిపారు. అయినప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం చోద్యం చూసిందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వ తీరుపై రాహుల్‌గాంధీ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు? సీఎం, మంత్రులు ఇక్కడ రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా వ్యవహరిస్తుంటే కనిపించడం లేదా? అని నిలదీశారు. రాజ్యాంగాన్ని జేబులో పెట్టుకుని తిరగడమే కాకుండా తమ ముఖ్యమంత్రి, నేతలకు దాన్ని పాటించాలని హితబోధ చేయాలని రాహుల్‌గాంధీకి హితవు పలికారు.

హామీలు అమలయ్యేదాకా ప్రభుత్వాలపై పోరాటం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థులకు ఇచ్చిన హామీలు అమలు చేసేదాకా తెలంగాణ జాగృతి పోరాటం చేస్తుందని కవిత తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేసేదాకా ప్రభుత్వాలను నిలదీస్తామని తెగేసి చెప్పారు. విద్యార్థుల హక్కులను సాధించేందుకు భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపట్టబోతున్నామని ప్రకటించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ పరిరక్షణ, హక్కులను కాపాడటం, పరిపాలనలో పారదర్శకత పాటించడం, రాజ్యాంగం నిర్దేశించిన ఆదేశిక సూత్రాలు సమర్థంగా అమలు చేయడం వంటి 19 తీర్మానాలను సెమినార్‌లో ఆమోదించారు. తీర్మానాలతో పాటు ఎమ్మెల్సీ కవిత రాసిన లేఖను తర్వలో విద్యార్థులు గవర్నర్‌కు అందించనున్నట్టు తెలిపారు.

రాజ్యాంగం వల్లనే సిద్ధించిన స్వరాష్ట్రం

దండలో దారంలాగా భారత రాజ్యాంగం మనందరినీ కలిపి ఉంచుతుందని కవిత అన్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ప్రకారం తెలంగాణను ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేయాలని పోరాటం చేశామని గుర్తుచేశారు. కొత్త రాష్ట్రం ఏర్పడాలంటే పార్లమెంట్‌లో బిల్ పాస్ అయితే చాలనే నిబంధనను అంబేద్కర్ నాడు రాజ్యాంగంలో పొందుపరిచారని పేర్కొన్నారు. ఒకవేళ రాష్ట్ర అసెంబ్లీలో కూడా బిల్ పాస్ కావాలనే నిబంధన ఉంటే తెలంగాణ రాష్ట్రం వచ్చేది కాదని చెప్పారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో రాజ్యాంగ స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్తామని చెప్పారు.

మందకృష్ణ మాదిగను ఘనంగా సత్కరిస్తున్న డాక్టర్ వంశీ తిలక్, లోకిన్‌రాజు

ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ వ్యతిరేకం

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

రవీంద్రభారతి, జనవరి 26 : ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ వ్యతిరేకమని, ఆ పార్టీలో మాల సామాజికవర్గం అధికంగా ఉండడంతో వారు అడ్డుపడుతున్నారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆరోపించారు. ఫిబ్రవరి 7న నిర్వహించే 'లక్ష డప్పులు–వేల గొంతుకలు' కార్యక్రమానికి తెలంగాణ ఎరుకల, ఆదీవాసీ సంఘం మద్దతుగా ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోకిన్‌రాజు మాట్లాడుతూ.. 'లక్ష డప్పులు– వేల గొంతుకలు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బీజేపీ నాయకుడు వంశీతిలక్ మాట్లాడుతూ.. మందకృష్ణకు పద్మశ్రీ అవార్డు ప్రకటించడంపై హర్షం వ్యక్తంచేశారు. అనంతరం మందకృష్ణను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గంజి వంశీ, మందుల శ్రావణ్, రాము, బాబు, గుండేటి శంకర్, లోకిన్ రాజు పాల్గొన్నారు.

17 నిమిషాల్లోనే మాట మార్పు

మొదటిపేజీ తరువాయి...

మడతేశారు. రైతు భరోసా నిధులు మార్చి31 లోపు రైతుల ఖాతాల్లో జమ చేస్తామని ప్రకటించటంతో రైతులు విస్మయం వ్యక్తంచేస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం చంద్రవంచలో నాలుగు సంక్షేమ పథకాలను ప్రారంభించారు. నాలుగు పథకాలను ప్రారంభించిన సీఎం రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. 'ఏడాదికి ఎకరాకు రూ.12 వేల చొప్పున ఇస్తున్నం. ఇవాళ బ్యాంకులకు సెలవు కాబట్టి, రైతు భరోసా డబ్బులు జమ కావు. అర్ధరాత్రి 12 దాటగానే ప్రతి ఎకరాకు రూ.6 వేల చొప్పున మీ ఖాతాల్లో, నగదు టకీటకీమని పడేలా ఈ రోజు కార్యక్రమాన్ని తీసుకున్నం' అని ఆర్భాటంగా ప్రకటించారు.

సంతోషం కొద్ది సేపు కూడా లేకుండా

సీఎం ప్రకటనకు మద్దతుగా చప్పట్లు కొట్టారు. భూమికి విత్తనానికి ఉన్న అనుబంధం.. రైతుకు కాంగ్రెస్‌కూ మధ్య ఉందన్నారు. రైతులకు ఉచిత కరెంట్‌ను ఇచ్చే పథకాన్ని మొదట అమలు చేసింది, దేశమంతటా రైతులకు రుణమాఫీ చేసింది కూడా కాంగ్రెస్ ప్రభుత్వమేనని ప్రసంగిస్తూ సరిగ్గా 17వ నిమిషంలో రేవంత్‌రెడ్డి మళ్లీ రైతు భరోసా ప్రస్తావన తెచ్చారు. 'రాష్ట్రంలో ఉన్న వ్యవసాయ యోగ్యమైన భూములకు రైతు భరోసా కింద దాదాపు మార్చి 31 తారీఖు లోపల రూ.10 వేల కోట్లు పేద రైతుల ఖాతాల్లో వేసి, రైతులకు ఇచ్చే బాధ్యత ఈ రోజు కాంగ్రెస్ పార్టీ తీసుకుంటుంది' అనటంతో రైతులంతా ఆశ్చర్యపోయారు. ముఖ్యమంత్రి రెండు నాల్కల ధోరణిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఆదినుంచీ మోసమే

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే డిసెంబర